1
నవతెలంగాణ
ఆదిలాబాద్
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నూతన జిల్లా వైద్యాధికారి కృష్ణ శుక్రవారం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెలివరీ, పారిశుధ్యం గురించి అధికారులు, సిబ్బందితో ఆరా తీశారు. సిబ్బంది వివరాలను డా.సర్ఫరాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులు ఎక్కువగా కేఆర్‌కే కాలనీలో ఉన్నాయని అధికారులు తెలిపారు. మలేరియా, టీబీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ ఎం.శ్రీధర్, డా.వంశీ, హెల్త్ సూపర్‌వైజర్స్ సుభాష్, మేరీ, స్టాఫ్ నర్స్ ప్రతిమ, రాధిక పాల్గొన్నారు.



నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కుంటగూడ గ్రామంలో నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు జిల్లా కేంద్రంలోని ఎంపీ నగేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. గ్రామానికి బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరు అయినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని తెలిపారు. పాలవాగు గ్రామంలో 20మంది పిల్లలున్నా ఇప్పటి వరకు పాఠశాల లేదని, దీంతో పిల్లల భవిష్యత్తు పాడవుతోందని పేర్కొన్నారు. గ్రామంలో ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడావి గంగారాం, ఆత్రం గంగారాం, యాదవ్‌రావ్, లక్ష్మణ్, బీర్సావ్ పాల్గొన్నారు.



మూడోది ముగిసే..ఆనందం విరిసే..!

- రూ.2లక్షల రుణమాఫీ పూర్తితో అన్నదాతల్లో హర్షం
- ఉమ్మడి జిల్లాలో 2.27లక్షల మందికి ప్రయోజనం
- సాంకేతిక కారణాలతో ఇంకా కొంత మందికి దూరం
- ఫిర్యాదు చేస్తే సరిచేస్తామని చెబుతున్న అధికారులు

బ్యాంకు రుణం మాఫీతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తొలి, రెండో విడతలో రూ.150లక్షల వరకు మాఫీ చేసిన ప్రభుత్వం తాజాగా మూడో విడత రుణమాఫీని కూడా రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నట్లయింది. బ్యాంకులో బకాయి పడిన సొమ్ము మాఫీ కావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మూడో విడతలో ప్రభుత్వం 61,416మంది రైతులకు గాను రూ.846.41కోట్లను విడుదల చేయడంతో అర్హులైన రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. మరోపక్క రుణమాఫీకి అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో ఇంకా కొంత మందికి బ్యాంకుల్లో జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీరు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని.. సంబంధిత ఏఈఓల వివరాలతో ఫిర్యాదు చేస్తే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని..వారికి కూడా మాఫీ జరుగుతుందని అధికారులు భరోసానిస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అరుగాలం కష్టించి పంటలు పండించే అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తొలి, రెండో విడతలో కలిపి రూ.1.50లక్షల వరకు బ్యాంకుల్లో రుణం కలిగిన రైతులకు రుణమాఫీ వర్తింపజేసిన ప్రభుత్వం తాజాగా పంద్రాగస్టు రోజున మూడో విడతలోనూ మిగితా రూ.2లక్షల వరకు రుణం కలిగిన వారికి కూడా వర్తింపజేసింది. రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో రూ.2లక్షల రుణమాఫీకి అర్హత కలిగిన రూ.2.27లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2135.37కోట్లు జమ చేసింది. దీంతో మూడో విడతకు కూడా తెరపడటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 13,155ఖాతాల్లో రూ.286.76కోట్లు జమ చేయగా.. నిర్మల్ జిల్లాలో 16,836 మంది ఖాతాల్లో రూ.227.50కోట్లు, మంచిర్యాల జిల్లాలో 13,155మంది రైతుల ఖాతాల్లో రూ.175.44కోట్ల జమ చేయగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 11,933మంది ఖాతాల్లో రూ.157.21కోట్లు మాఫీ చేసింది. దీంతో తాజాగా రూ.1.50లక్షలకు పైగా బ్యాంకుల్లో బకాయి పడిన రైతులు సైతం రుణమాఫీ కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక కారణాలతో అవస్థలు..!

రుణమాఫీ ప్రక్రియలో పొరపాట్లు జరగడంతో అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర బ్యాంకులో ఖాతాలు కలిగిన కొంత మంది రైతులు ఇబ్బందులు పడిన సందర్భాలున్నాయి. సాంకేతిక కారణాలతో బ్యాంకుల్లో జరిగిన పొరపాట్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ.. వివిధ కారణాలతో మాఫీ జరగడం లేదు. రుణఖాతా, ఆధార్‌లో ఒకే విధంగా పేర్లు లేకపోవడం..చిన్నపాటి అక్షర దోషాలు దొర్లడం, బ్యాంకు ఖాతాలు సైతం తప్పుగా నమోదు కావడం, కొందరి వద్ద పాస్ పుస్తకాలు లేకపోవడం తదితర కారణాలతో రుణమాఫీ జరగడం లేదని తెలుస్తోంది. ఇలాంటి సమస్యలతో ఇప్పటికే ఆదిలాబాద్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రానికి 400కి పైగా దరఖాస్తులు రాగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2వేలకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. వీటిని సరిచేస్తూ ప్రభుత్వానికి పంపిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఏఈఓలను సంప్రదించాలి : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

రుణమాఫీకి అర్హులై ఉండి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోతే ఆయా వివరాలతో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలి. వాటిని విచారించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. అర్హులైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మరోపక్క మూడో విడత రుణమాఫీకి సంబంధించి రైతుల వివరాలు ఇంకా తమకు చేరలేదని తెలిపారు.

రుణమాఫీ ఆర్భాటమే : ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీలో ఆర్బాటమే తప్ప రైతులందరికీ వర్తింపజేయడంలో శ్రద్ధ తీసుకోవడం లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇప్పటి వరకు మూడో జాబితా విడుదల చేయలేదని తెలిపారు. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రుణ మాఫీ కోసం 31వేల కోట్ల రూపాయలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటికి కేవలం 18వేల కోట్లతో సుమారు 21లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారని తెలిపారు. అసమర్థ పాలనతో అపఖ్యాతి మూట కట్టుకున్న రేవంత్‌రెడ్డి అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకే చిల్లరమాటలు మాట్లాడుతున్నాడని తెలిపారు. అభివృద్ధిని, పాలనను పక్కనపెట్టి బీఆర్ఎస్‌ను తిట్టడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పి నేటికీ అతీగతీ లేకుండా ఉందని విమర్శించారు. వైరా సభలో ప్రకటన చేసిన విధంగా బ్యాంకుల నుంచి ఇంకా రైతులకు మాఫీ మెసేజ్‌లు కూడా రాలేదని తెలిపారు. రుణమాఫీ కోసం రైతులు బ్యాంకులు, తహసీల్దార్, అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. సీఎం మాట్లాడితే హరీష్‌రావు రాజీనామా చేయాలంటూ తిట్టడమే తప్ప వేరే పని లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట తప్పినందుకు ఏకకాలంలో రుణమాఫీ చేయనందుకు, ఆగస్టు-15 దాటిపోయినా ఇంకా రుణమాఫీ పూర్తి చేయనందుకు రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోథ్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ సజన్, నాయకులు తిరుమల్‌గౌడ్, జాదవ్ రమేష్, పండరి, సద్దాం పాల్గొన్నారు.

నాళాల భూములు ఆక్రమిస్తే చర్యలు



నవతెలంగాణ-ముధోల్

రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాళాల భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డిఓ కోమల్‌రెడ్డి అన్నారు. ముధోల్ బస్టాండ్ సమీపంలో ఉన్న రోడ్డు అవతలి వైపు భూమి ఆక్రమణకు గురి కావడంతో వర్షం కురిసినప్పుడు తరుచు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో శుక్రవారం ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆర్డిఓ దగ్గరుండి జేసిపిని తెప్పించి రోడ్డుకు అవతలి వైపు గతంలో ఉన్న కాలువను తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా వర్షపు నీరు, మురికి నీరు వెళ్లడానికి కాలువను తవ్వించామన్నారు. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. చట్టం అందరికి సమానమే అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాయికిరణ్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణపటేల్, పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యాలు కల్పించిన వాజ్‌పేయి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఎం సడక్ యోజన కింద దివంగత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి గ్రామీణ ప్రాంతాలను అనుసంధం చేస్తూ నాలుగు వరుసల రోడ్డు సౌకర్యాలు కల్పించారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా వాజ్‌పేయి అనేక సేవలు అందించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వ పక్షానికి ఆయన అనేక సూచనలు చేశారన్నారు. తొలిసారి పీఎం సడక్ యోజన పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాలకు కూడా రోడ్డు సౌకర్యాలు కల్పించారన్నారు. ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా 20వేల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేలా నిధులు కేటాయించారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఆదిలాబాద్ నుంచే ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో వాజ్‌పేయి ప్రారంభించారని గుర్తు చేశారు. సడక్ యోజన కూడా బేల మండలం అవల్పూర్ నుంచే ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, వేదావ్యాస్, రాజు, ముకుంద్, ఆకుల ప్రవీణ్, రఘుపతి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు : డీఆర్‌డీఓ దత్తారావు



నవతెలంగాణ-బెజ్జూర్

ఉపాధి హామీలో అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డిఆర్డిఓ దత్తారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 2023-24కు సంబంధించిన రూ.5కోట్ల పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఉపాధి హామీలో 298 పనుల్లో 24 అంశాలపై 42 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు వచ్చినట్లు తెలిపారు. 69వేల నిధులను రికవరీ చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి సిబ్బందికి రూ.12వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కొలతల్లో తేడాలతో పాటు వివిధ కారణాలతో సిబ్బందికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా సహించే లేదని హెచ్చరించారు. ప్రతి కూలికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీవో గౌరీశంకర్, ఎస్ఆర్పి తిరుపతి, డిఆర్పి అశోక్, ఏపీవో రజనీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేయడంలో సీఎంకు ఆస్కార్ ఇవ్వొచ్చు : జోగు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. మోసం చేయడం, అబద్దాలు ఆడడంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని హేళన చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. దశల వారీగా చేస్తు ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయంలో రైతుబంధు కింద డబ్బుల కంటే తక్కువగా చేశారన్నారు. రాష్ట్రంలో 59లక్షల మంది రైతులుంటే కేవలం 22లక్షల మందికే రుణమాఫీ చేశారన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి : అశోక్‌కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ప్రదర్శన కనబర్చాలని డైరెక్టర్ హెచ్ఎండీ అశోక్ కుమార్ అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాలీబాల్, క్యారం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని టీఎస్ఎన్‌పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కో మూడు కంపెనీలను కలిపి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. వాలీబాల్, క్యారంకు సంబంధించిన వచ్చిన జట్లు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఇలాంటి క్రీడల వల్ల కంపెనీల మధ్య పరిచయాలతో పాటు స్నేహ భావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ జేఆర్ చౌహన్, స్పోర్ట్ ఆఫీసర్ జగన్నాథ్, కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్డిఓ రత్న కళ్యాణి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని తన కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాలలోని ఖాళీ ప్రదేశాలలో ప్రతి ఉద్యోగి విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రాజేశ్వర్, తహసీల్దార్ రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె రాఖీ స్టాల్స్ ఏర్పాటుకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అద్దెకు రాఖీ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్టీసీ డిఎం విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాఖీ స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారు ఆర్టీసీ డిపో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేదరిపేట్ గ్రామంలో చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మండలానికి ఒక లిఫ్టుతో పాటు అన్ని సామాజిక వర్గాలకు చెందిన 4000 వేల మంది విద్యార్థులు చదివే సామర్థ్యం గల ఆశ్రమ పాఠశాలను రెబ్బనపల్లి గ్రామంలో నిర్మించనునట్లు పేర్కొన్నారు. 15 సంవత్సరాలుగా లేని అభివృద్ధిని కేవలం మూడు సంవత్సరాల్లో చేసి చూపిస్తానని తెలిపారు. మహిళల అభివృద్ధి లక్ష్యంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి కేటాయించి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో మరో మూడు రైస్ మిల్స్ ఏర్పాటు చేసి ఐకెపి మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద 240 చెక్కులకు రూ.2.40కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, లక్షెటిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచందర్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేరుస్తుందన్నారు. రైతుల పక్షపాతిగా తమ పార్టీ ఉందనడంలో ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి అవసరం లేదన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15తో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కేవలం 25రోజుల వ్యవధిలో 2లక్షల రూపాయల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకేష్, నిజాం, జక్కన్న, సత్యనారాయణ, శంకర్, మారుతి పటేల్, బాలేష్, ఆరిఫ్ అలీ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ బాధితులకు బాసట



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లా ప్రజలు బాసటగా నిలిచారు. హిందూ వాహిని, జాగో హిందూ కమిటీ ఆధ్వర్యంలో ఇచ్చిన ఆసిఫాబాద్ బంద్‌లో పలువురు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో సాయిబాబా ఆలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పొట్టి శ్రీరాములుచౌక్, పోస్ట్ ఆఫీస్ రహదారి నుండి కేశవనాథ ఆలయం రోడ్డు ద్వారా వాసవి టెంపుల్ ముందు నుండి ప్రధాన రహదారుల గుండా బస్టాండ్ వరకు సాగింది. జాగో హిందూ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ జెడ్పిటిసి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, రాష్ట్ర నాయకుడు సతీష్ బాబు, జాగో హిందూ కమిటీ అధ్యక్షుడు ఆకుల సంతోష్, నాయకులు మారుతి, జయరాజ్, వెంకన్న పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సదయ్య, సిఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్రం సుగుణక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణక్క జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఉట్నూర్‌లోని ఆమె నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కో ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, సీనియర్ నాయకులు నలిమెల నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, కొరెటి ప్రభాకర్, బాలకృష్ణ, నాగన్న, సంటెన్న, సురేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర ఆధ్వర్యంలో సమ్మె

నవతెలంగాణ-ఉట్నూర్



ఆరోగ్య మిత్ర ఆధ్వర్యంలో సమ్మె చేపట్టడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉపేందర్‌కు నోటీసులు ఇచ్చామని ఆరోగ్య మిత్ర ఉట్నూర్ మండలాధ్యక్షుడు జాదవ్ విజేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరోగ్యమిత్ర సిబ్బంది డేటా ప్రాసెసింగ్ అధికారులకు క్యాడర్‌ను కల్పించాలని, వెంటనే ఆరోగ్య మిత్ర సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని కోరారు. జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు రూ.22,750 ఇవ్వాలని లేని పక్షంలో సమ్మె చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గత 16 సంవత్సరాల నుంచి పీహెచ్‌సీలో పనులు చేస్తున్న ఆరోగ్య మిత్రులకు సినియార్టి ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ప్రియాంక, ఆత్రం అనసూయ, సునీత, రాజమణి, జాదవ్ ప్రియాంక పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని డీఆర్డీఓ మండల ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ధనోర(బి) గ్రామంలో మహిళా సంఘాలతో మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా తీసుకున్న బ్యాంకు లింకేజి రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న వివిధ వ్యాపార దుకాణాల్లో ప్లాస్టిక్ రహిత బ్యాగులను వాడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల కు ఇస్తున్న రుణాలతో స్వయం ఉపాధి పొందాలన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీడీఓ కే.భాస్కర్, తహసీల్దార్ మెంగు ప్రవీణ్, ఐకేపీ ఎపీఎం రాథోడ్ రామారావ్, టీఏలు పృథ్వీరాజ్, సంతోష్ జైస్వాల్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన డెడ్రా గ్రామస్తులు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని డెడ్రా గ్రామస్తులు గ్రామ పటేల్ లింగు ఆధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం తమ గ్రామానికి సంబంధించిన సమస్యలు తెలిపారు. ముఖ్యంగా గుట్టపై ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యం విషయంలో (ఫారెస్ట్ క్లియరెన్స్) అదేవిధంగా గ్రామాలలో సీసీ రోడ్ల విషయంలో, సెల్ టవర్ విషయంలో తీవ్ర ఇబ్బంది పరిస్థితులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దానికి ఎంపీ నగేష్ సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా వర్షాలు తగ్గుముఖం పట్టగానే రోడ్లకు సంబంధించిన పనులు మొదలు పెడతామని, ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంలో అటవీ అధికారులతో మాట్లాడి ఖచ్చితంగా క్లియరెన్స్ వచ్చే విధంగా కృషి చేస్తానని, గుట్టపై ప్రాంతంలో ఏదైనా అత్యవస సమయంలో అలాగే విద్యార్థులకు సంబంధించిన అంతర్జాల సేవల విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడి తప్పకుండా టవర్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, డేడ్రా గ్రామ మాజీ సర్పంచ్ భీంరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం



నవతెలంగాణ-ముథోల్

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి-మాల మహానాడు, సంఘాల నాయకులు ఎస్సీ వర్గీకరణ నియోజకవర్గం కమిటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ముథోల్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి అధ్యక్షులు ప్రకాష్, అడ్వైజర్ ప్రభాకర్ గాడ్‌పాలే పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి తాలూకా జనరల్ సెక్రటరీ అధ్యక్షుడు విఠల్ కాంబ్లె మాట్లాడారు. దేశంలోని మనువాద అగ్రకుల పార్టీలన్నీ వారి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఎస్సీ-ఎస్టీలను విభజించి బలహీనపరిచేందుకు జరిగిన కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఆర్టికల్ 341కి విరుద్ధంగా రిజర్వేషన్లు రాజకీయ ప్రమేయానికి వీలు కల్పిస్తూ రాష్ట్రాలకు అధికారం కల్పించిందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై అప్పీల్ చేస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో ఉన్న గౌతం బుద్ధునికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి నియోజకవర్గ ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, చంద్రశేఖర్ గాయక్వాడ్, ట్రెజరర్ ధర్మాజీ చందనే, ఆర్గనైజర్ రమేష్ బాబు వాగ్మరే, జనరల్ సెక్రటరీ దండు సాయినాథ్, వివిధ గ్రామాల మాల మహానాడు సంఘాల నాయకులు, భీమ్ ఆర్మీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన డీఎల్పీఓ

నవతెలంగాణ-సిరికొండ

పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని శుక్రవారం డిఎల్పిఓ ఫణిందర్‌రావ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిచ్చికుక్క దాడి బాధితుల గురించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీఓ సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, ఆశా వర్కర్ జ్యోతి ఉన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-నార్నూర్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వాస్పత్రి, ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్యసిబ్బంది రికార్డులు మందుల స్టాక్, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ వంట గది వంట సరుకులు పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యసిబ్బంది నాణ్యమైన వైద్యం అందించాని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు రిపోర్టు ఇవ్వాలన్నారు. అదేవిధంగా గర్భిణీ మహిళలు ప్రయివేటు ఆస్పత్రిలో ప్రసవాలు జరగకుండా వారికి అవగాహన కల్పించి, ప్రభుత్వాస్పత్రిలోనే వంద శాతం ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు ఆస్పత్రిలో పరిసరాలను గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి భోజనం పెట్టాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులు చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఎంపీడీఓ ఎంపీఓపై కలెక్టర్ ఆగ్రహం


ఆస్పత్రి వెనుక పిచ్చి మొక్కలు ఉండటంతో ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ స్వప్నశీలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు షోకాజ్ నోటీసు ఇచ్చినా కూడా విధుల్లో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. వారి వెంట డీపీఆర్‌ఓ బాదావత్ తిరుమల, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజలింగం, సూపరింటెండెంట్ ఉపేందర్, పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు, ఏపీఓ సురేష్ జాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను నియమంచాలి...

మండలంలో పర్యటనకు వచ్చిన కలెక్టర్ రాజర్షిషాను బీజేపీ మండల నాయకులు కలిసి మండలంలోని సమస్యలను విన్నవించారు. సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హస్నాపూర్ నుంచి నార్నూర్, గాదిగూడ మెడిగూడ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెండు మూడు సవంత్సరాలలో రోడ్డు చెడిపోకుండా ఏ1 కాంట్రాక్టర్‌తో రోడ్డు పనులు చేయించాలని కోరారు. అదేవిధంగా ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వారంలోగా ఇద్దరూ వైద్యులను నియమించాలని డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్‌ను ఆదేశించారు. త్వరలో రోడ్డు మంజూరు చేయిస్తామని, హామీ ఇచ్చారు. ఇందులో బీజేపీ నాయకులు బిక్కు, ప్రకాశ్, బండు ఉన్నారు.

బాసరలో నిఘా నిద్రపోతోంది...?

- బాసర ఆలయంలో దొంగతనంతో బయటపడ్డ భద్రత వైఫల్యం



నవతెలంగాణ-ముథోల్

దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర జ్ఞాన సరస్వతి పుణ్యక్షేత్రంలో బుధవారం రాత్రి జరిగిన దొంగతనం భద్రత వైఫల్యాన్ని ఎత్తి చూపుతుంది. నిత్యం భక్తులతో కిటకటలాడే ఆలయం ఒకేసారి ఆలయ సెక్యూరిటీ ఉండగా కూడా గుర్తు తెలియని దొంగ యదేచ్ఛగా ఆలయంలో దొంగతనానికి పాల్పడటం భద్రతకు వైఫల్యమేనని పలువురు ఆరోపించారు. మరోసాటి రోజు దొంగతనం జరిగిన విషయం బయటపడింది. అప్పటివరకు సెక్యూరిటీ సిబ్బందికి తెలియక పోవటం గమనార్హం. ప్రతి రోజు నిఘాధికారులు ఎప్పటికప్పుడు భద్రత విషయాన్ని పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం లోపలికి గుర్తు తెలియని దొంగ చొరబడి దత్తాత్రేయ మందిరం ఎదుట ఉన్న హుండిని పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. సుమారు రెండు గంటల పాటు దొంగ సంచరించి న్నట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆలయంలో సెక్యూరిటీ మాత్రం పట్టించుకోకపోవడం వలన పలు అనుమానాలకు తావిస్తోంది. దేశ నలుమూలల నుంచి భక్తులు జ్ఞాన సరస్వతి దేవిని దర్శించుకోవడానికి ప్రతినిత్యం భక్తులు వస్తుంటారు. భక్తుల భద్రత దేవుడేరుగు గాని హుండీ పగులగొట్టి దొంగ యదేచ్ఛగా డబ్బును దొంగలించడంపై స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. ఆలయంలో భద్రత కోసం హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారి పనితనాన్ని పర్యవేక్షించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తుంది. బాసర ఆలయాన్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన భద్రతాధికారులు భద్రతను గాలి వదలడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు, భక్తులు సైతం బాసర ఆలయ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే మహారాష్ట్ర ఉన్నప్పటికీ, బాసరలో రైల్వే స్టేషన్ ఉండటంతో రాకపోకలు బాగా ఉంటాయి. నిత్యం నిఘాధికారులు డేగ కన్నులతో భద్రతను పర్యవేక్షించాల్సి ఉండగా కేవలం సంఘటన జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేస్తారే తప్ప మళ్లీ భద్రతను పట్టించుకున్న పాపాన పోలేదని, పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బాసర ఆలయాలనికి పటిష్ట భద్రత ఏర్పాటు చేసి, భక్తుల మనోభావాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

బాసర భద్రతకు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేయాలి

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానానికి ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలనే వాదన తెరమీదికి వచ్చింది. గత రెండు రోజులు కింద బాసర ఆలయంలో దొంగతనం జరిగిన ఘటన చోటు చేసుకుంది. నిఘా లేకపోవడంతో తరుచు ఏదో ఒక సంఘటన జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆలయ ప్రతిష్ట దెబ్బతింటుందని భక్తులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు ఆలయ భద్రతకు దేవస్థానం ఆధ్వర్యంలో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే భద్రత విషయంలో కఠినంగా ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం బాసర పోలీసులు వసంత పంచమితో పాటు పలు ముఖ్యమైన పండుగలకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తారు. అంతవరకు బాగానే ఉంది. అయితే ప్రతి రోజు దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ భద్రత కోసం హోంగార్డులు విధులు నిర్వహిస్తారు. దీంతో భద్రత విషయంలో పలు సందర్భాల్లో రాజీ పడతారన్న అపవాదు లేకపోలేదు. బాసరలో పుణ్యక్షేత్రం, రేల్వేస్టేషన్, ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీలు, ఉన్నాయి. వీటికి వచ్చే, వీఐపీలు, ప్రోటోకాల్ బాధ్యతలు స్థానిక పోలీసులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ట్రిపుల్ ఐటీలో సమస్యలపై విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. వీటిని అదుపు చేయడానికి పోలీసులు కొన్ని సమయంలో అధిక సమయం కేటాయిస్తున్నారు. దీనికి తోడు సరిపడే పోలీస్ సిబ్బంది లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది. ఇన్ని సవాళ్ల మధ్య పోలీసులు తమ విధులు నిర్వహిస్తున్నారు. బాసర ఆలయ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించంటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆలయ భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటేే తప్ప ఇలాంటి ఘటనలు జరుగవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆలయ భద్రతకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందాం

- రూ.320 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- ఎమ్మెల్యే పాయల్ శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రేడ్ వన్‌గా మారిన మున్సిపాలిటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ వాక్‌లో ఖానాపూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అర్బన్ తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు వివిధ శాఖల అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో రూ.320 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు, మంచినీటి సరఫరా కోసం ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు ఏర్పాటు చేసి, నెల రెండు నెలలలోపే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆదిలాబాద్ భవిష్యత్తు ఖానాపూర్ చెరువు పైనే ఉందన్నారు. ఈ చెరువులో పట్టణంలోని మురుగునీరు, డ్రైనేజీ నీరంతా చెరువులో కలవడంతో చెరువు అంతా దుర్గంధం అవుతుందన్నారు. నీరు నిలవాలి లేని కారణంగా భూగర్భ జలాలు కూడా రోజురోజుకు తగ్గిపోతున్నాయని అన్నారు. పూర్తిగా చెరువు కలుషితం కావడంతో దోమలు వృద్ధి చెంది పట్టణంలో వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. కొందరు అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారి వివరాలతో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. అందరు సహకరించినప్పుడే మంచి జరగడానికి ఆస్కారం ఉందన్నారు. రూ.320 కోట్లతో అభివృద్ధి చేసుకోవడంతో పాటు, మరింత అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. ఖానాపూర్ చెరువు భవిష్యత్ తరాల పిల్లలకు మంచి అహ్లాదకరమైన వాతావరణం అందించడానికి కృషి చేద్దామన్నారు. త్వరలో ఆదిలాబాద్ విమానాశ్రయం, రైల్వేలైన్ ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, లాలా మున్న, జోగు రవి, విజయ్, రత్నాకర్, ముకుంద్ నాయకులు ఉన్నారు.

భారీ వర్షంతో రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-తాంసి

జిల్లాలో కురుస్తున్న వర్షానికి శుక్రవారం లోలేవల్ వంతెనలతో పాటు వాగులు ఉప్పొంగాయి. దీంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. భీంపూర్ మండలం కరంజికి వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారిపై ఉన్న కప్పర్ల ఎక్స్‌రోడ్ దగ్గరలోని లోలెవెల్ వంతెన భారీ వర్షానికి పొంగిపొర్లడంతో అటుగా వెళ్లే బస్సులు వాహనదారులు రోడ్డు దాటలేక గంటల తరబడి రోడ్డుపైనే నిలిచి పోయారు. ఇటు రోడ్డు దుస్థితి సరిగా లేక గుంతల మయంగా ఉండటంతో అటుగా వెళ్లే గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024-25 విద్యా సంవత్సరానికి గాను విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు "అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి" పథకం ద్వారా స్కాలర్‌షిప్ కోసం ఈ పాస్‌ను జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు అక్టోబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8886976630 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రామాలను ప్రస్తుత గ్రామపంచాయతీలో కొనసాగించాలి



నవతెలంగాణ-తలమడుగు

తమ గ్రామాలను ప్రస్తుతం కొనసాగుతున్న గ్రామపంచాయతీలోనే కొనసాగించాలని మండలంలోని టొక్కిగూడ, శేర్‌గూడ గ్రామస్తులు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ రెండు గ్రామాలు ఝరి గ్రామపంచాయతీలో కొనసాగగా పూనగూడ నూతనంగా గ్రామపంచాయతీగా ఎర్పడిందని అన్నారు. కొత్తగా ఏర్పడిన పూనగూడ గ్రామపంచాయతీలో టొక్కిగూడ, శేర్‌గూడలను కలుపొద్దని అన్నారు. తమకు ఝరి గ్రామం నుంచి రోడ్డు ఉందని, దగ్గర ఉందని అన్నారు. అదే నూతనంగా ఏర్పడిన పూనగూడ గ్రామపంచాయతీ నాలుగు కిలో మీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. దూరభారంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. తమ గ్రామాలను పాత గ్రామపంచాయతీలోనే కొనసాగించాలని కోరారు. మ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, మేకల రవికాంత్, గ్రామస్తులు జనక్ పటేల్, సకరామ్, రాజారాం, సురేష్, లక్ష్మణ్, హనుమంతు, విఠల్, మంతు, జంగు, పొచ్చిరాం ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ విద్యా కమిటీ చైర్మెన్ మహమ్మద్ రఫీక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థులకు తన వంతుగా తన సొంత ఖర్చులతో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రిజ్వాన తన్వీర్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగులమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంగ లక్ష్మి(63) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వయసు పై పడటంతో తన సొంత పనులు చేసుకోవడానికి సైతం శరీరం సహకరించకపోవడంతో గురువారం పురుగులమందు తాగాగా అదే రోజు కుటుంబ సభ్యులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

17న జిల్లా స్థాయి యోగా పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పతాంజలి యోగ కేంద్రంలో ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లా స్థాయి యోగ పోటీలు నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలు, మాస్టర్స్ విభాగంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల 9949223912, 9573868783 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | 17 ఆగస్టు, 2024 | www.navatelangana.com

ర్యాలీలో ఎమ్మెల్యేకు అస్వస్థత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మికి కొంత అస్వస్థత గురికావడంతో పలువురు ఆందోళనకు గురయ్యారు. సాయిబాబా ఆలయం నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు సాగిన ర్యాలీలో ప్రజలతో కలిసి నడిచిన తర్వాత చివరి పాయింట్ అంబేద్కర్ చౌక్ వద్దకు చేరుకోగానే కొంత కళ్ళు తిరిగినట్లు కావడంతో వెంటనే చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్న గద్దెలపై కూర్చున్నారు. వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు చేయించారు. హఠాత్తుగా ఎమ్మెల్యే అస్వస్థతకు గురికావడంతో పలువురు ఆందోళనకు గురయ్యారు. వెంటనే కోలుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రైలు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తాను దిగాల్సిన స్టేషన్ వచ్చిందనే హడావుడిలో రైలు బోగి తలుపు వద్దకు వచ్చిన ఒక వ్యక్తి అదుపు తప్పి రైలు కింద పడడంతో అతని రెండు కాళ్లు తెగిపోయిన ఘటన కాగజ్‌నగర్‌లో శుక్రవారం జరిగింది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన వ్యవహాడె ప్రశాంత్ హైద్రాబాద్ నుండి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో కాగజ్‌నగర్‌కు బయల్దేరాడు. కాగజ్‌నగర్ స్టేషన్ సమీపానికి రైలు రాగానే హడావుడిగా ప్రశాంత్ తలుపు దగ్గరకు వచ్చాడు. అదుపు తప్పి రైలు కింద పడ్డాడు. అతని రెండు కాళ్లపై నుండి రైలు చక్రాలు వెళ్లడంతో అవి తెగిపోయాయి. వెంటనే జీఆర్‌పీ కానిస్టేబుల్ మహేష్, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ పీకె సింగ్‌లు అతన్ని పైకి తీసి ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మంచిర్యాలకు తరలించారు. ప్రశాంత్ నుండి కుటుంబీకుల ఫోన్ నెంబర్ తెలుసుకొని వారికి సమాచారం అందించారు.

కాగజ్‌నగర్‌లో బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ శుక్రవారం పలు హిందూ సంఘాలు కాగజ్‌నగర్‌లో బంద్ నిర్వహించాయి. ఈ బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఉదయం నుండే హిందూ సంఘాలు మార్కెట్‌లో తిరుగుతూ వ్యాపారస్తులను బంద్ పాటించాలని కోరారు. దీనితో మార్కెట్ అంతా నిర్మానుష్యంగా మారింది. అనంతరం హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. వారు కూడా మార్కెట్‌లో తిరిగి ప్రతీ ఒక్కరు బంద్ పాటించాలని కోరారు.

మైనార్టీలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు : ఎమ్మెల్యే హరీష్‌బాబు

బంగ్లాదేశ్‌లో మైనార్టీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగజ్‌నగర్‌లోనే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాలలో హిందువులు ఐక్యంగా, సంపూర్ణంగా బంద్‌లో పాల్గొన్నారని అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులు, జైన్, క్రిస్టియన్‌లపై హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని, కేంద్ర విదేశాంగ శాఖ జోక్యం చేసుకొని వారిని కాపాడాలని కోరారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో శుక్రవారం హిందూ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు బంద్ సంపూర్ణం నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు దేవాలయలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు బంద్ సంపూర్ణంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, కిరాణా వ్యాపారాలు, కూరగాయలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలు బంద్ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనను జరగకుండా బెజ్జూర్ ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో పోలీస్ ఏర్పాటు చేశారు.



వీడిన పోడు భూముల సమస్య



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గత కొన్ని రోజుల నుంచి సిర్పూర్ అడవి రేంజ్ పరిధిలో ఉన్న రిజర్వు ఫారెస్టుకు సమీపంలో గల ఇట్టికల్ పహాడ్ గ్రామంలో పోడు భూముల సమస్య పరిష్కారం అయింది. సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రావి శ్రీనివాస్ జోక్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర నాయకత్వానికి వివరించి సంబంధిత అధికారుల ద్వారా కుటుంబానికి నాలుగు ఎకరాల చొప్పున తాత్కాలికంగా కేటాయించారు. దాదాపు రెండు నెలల నుండి రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు సమక్షంలో సర్వేలు చేయించి శుక్రవారం ఇటికేల్ పహాడ్ గ్రామంలో 192 కుటుంబాలకు 600 ఎకరాలు కుటుంబానికి నాలుగు ఎకరాలు భూమి వచ్చేలా హద్దులు పెట్టి రెవెన్యూ అటవీ, పోలీస్ అధికారులు సమక్షంలో రైతులకు తాత్కాలిక భూములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధిత శాఖ అధికారులతో పలుదపాలు చర్చలు జరిపి ఏ ఒక్కరు కూడా నష్టపోకుండా ప్రతి కుటుంబానికి భూమి వచ్చేలా చేశానని, ఎవరికి ఎంత భూమి కేటాయించారో వారి వారి హద్దుల్లో ఉండి వ్యవసాయం చేసుకోవాలని, ఎలాంటి గొడవలు చేసుకోవద్దని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమములో కిసాన్ సెల్ అధ్యక్షుడు కస్తూరి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి పాల్గొన్నారు.

నేడు ప్రయివేటు ఆస్పత్రుల మూసివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనలు నిరసిస్తూ ఆదిలాబాద్ ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం ప్రియివేటు ఆసుపత్రులన్నీ మూసివేసి బంద్ పాటిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆసుపత్రులన్నీ మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. 24 గంటల పాటు ఆస్పత్రి సేవలు నిలిపిసి నిరసన తెలుపుతున్నాట్లు వివరించారు. ఈ నిరసన ప్రదర్శన ఉంటుందని వైద్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట నూతన కమిటీని ఎస్సీ కులస్తులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగ మండల కన్వీనర్‌గా ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా అంబకంటి శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీరాములు. ఉపాధ్యక్షులుగా దండే రమేష్, అర్ల నరేష్, మగ్గిడి గంగన్న, మోడం శంకర్, హర్ష ముత్యం, కార్యదర్శులు జి.చంద్రశేఖర్, సలహాదారులుగా దిలీప్, లక్ష్మణ్, గంగన్న, పరత్కార్ రాములు, బాబన్న ఎన్నికయ్యారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

- కెరమెరిలో విషాదఛాయలు
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలో పిడుగుపాటుకు శుక్రవారం వేరు వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. కెరమెరి మండల కేంద్రంలో వ్యవసాయ కూలీ మండల కేంద్రానికి కుతవేటు దూరంలోని పంట పొలాల్లో పిడుగు పాటుకు చౌదరి రమేష్(30) వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఎస్ఐ గుంపుల విజయ్ కుమార్ మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరి రమేష్ గత కొంత కాలంగా మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. రోజు లాగే ఉదయాన్నే చింతకర్ర గ్రామానికి వెళ్లే మార్గంలోని హుస్సేన్‌కు చెందిన పంట చేనులో వ్యవసాయం పనులు చేస్తున్న క్రమంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పనుల్లో నిమగ్నమైన రమేష్ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ మృతుడి భార్య సుమిత్ర పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

చౌదరి రమేష్‌కు నలుగురు అన్నదమ్ములు కాగా, గత రెండేళ్ల క్రితం రెండోవాడు అనారోగ్యంతో మృతి చెందాడు. కటిక పేదరికంలో ఉన్న చౌదరి రమేష్‌కి 2020లో ఇటికాల గ్రామానికి చెందిన సుమిత్రతో వివాహం జరిగింది. సిద్దు(3)ఆది(1) ఇద్దరు కుమారులున్నారు. సుమిత్రకు తల్లిదండ్రులు లేరు. మతుడు రమేష్ సైతం తల్లిదండ్రులు లేరు. ఉదయం వరకు భార్య పిల్లపాపాలతో గడిపిన రమేష్ మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. మృతుడి భార్య రోదనలు చూపరులను కంట తడి పెట్టించాయి. ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులను చూసిన గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.



ఆసిఫాబాద్‌లో యువకుడు మృతి

ఆసిఫాబాద్ : పిడుగుపాటుకు గురై యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని నందుప గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దౌత్రే అంజన్న(20) రోజులాగే తమ వ్యవసాయ భూమిలో పనుల కోసం వెళ్లాడు. సాయంత్రం వర్షం కురుస్తుండడంతో పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మార్గ మధ్యంలో పిడుగు పాటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అంజన్నను కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే ఆయన మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

శ్యామ్‌రావు మృతదేహం వెలికితీత

- అడ్డుకునే ప్రయత్నం చేసిన కుటుంబసభ్యులు
- రీ పోస్టుమార్టం నిర్వహించిన ఫోరెన్సిక్ నిపుణులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల మూడో తేదీన మృతి చెందిన కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన కొట్రంగి సాంబయ్య అలియాస్ శ్యాంరావు మృతదేహాన్ని శుక్రవారం వెలికితీశారు. ఆర్డీఓ సురేష్ సమక్షంలో పోలీసులు కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, ఎస్ఐ మహేందర్‌లు ఈ మృతదేహాన్ని వెలికితీయగా, మంచిర్యాల మెడికల్ కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ నిపుణులు ఇద్దరు ఆ మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. దీనిని మృతుని కుటుంబసభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడినుండి పంపించివేశారు. సాంబయ్య అలియాస్ శ్యాంరావు మృతి పట్ల పలు అనుమానాలు రావడం, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రీ పోస్టుమార్టం నిర్వహించారు. కాగా ఇందులో పోలీసుల పాత్రపై పలు అనుమానాలు వినిపిస్తున్నాయి. సాంబయ్య ఈ నెల మూడో తేదీన మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఖననం చేసేందుకు తీసుకువెళుతున్న



మృతదేహాన్ని వెలికితీసేందుకు తవ్వుతున్న దృశ్యం



రోదిస్తున్న మృతుని కుటుంబీకులు

సమయంలో పోలీసులకు సమాచారం అందడంతో వారు వెళ్లి అడ్డుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేవలం మృతుని తల్లి భీంబాయి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారే తప్ప దీనిపై ఎలాంటి విచారణ జరుపలేదు. మృతదేహంపై గాయాలున్నాయా, ఉంటే ఏ అవయవాల దగ్గర ఉన్నాయనే కనీస విచారణ లేకుండానే పోలీసులు కేసు నమోదు చేశారు. సాంబయ్య చనిపోవడానికి రెండు రోజుల ముందు తన ఇంట్లో జరిగిన గొడవ కారణంగానే తీవ్రంగా గాయపడ్డాడని, ఆ గాయాలతోనే రెండు రోజుల తర్వాత ఆసుపత్రిలో మృతి చెందినట్లు గుర్తు తెలియని వ్యక్తి 100కు కాల్ చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఖననం చేసేందుకు తీసుకువెళ్తున్నారని తెలిసీ పోలీసులు లోతుగా ఎందుకు విచారణ జరుపలేదనే సందేహం ఇక్కడ తలెత్తుతోంది.

నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు : డీఎస్పీ కరుణాకర్

రీ పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. రీ పోస్టుమార్టం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంబయ్య మృతి పట్ల పలు అనుమానాలు ఉండడంతో రీ పోస్టుమార్టం చేశామని, ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణలోని మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మహిళలోకానికి బేషరతు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందజేశామని అన్నారు. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలన్నారు. కేటీఆర్ ఈ విషయం మరిచి వారిని అగౌరపరిచేలా మాట్లాడడం సరైనది కాదన్నారు. వారందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడం బీఆర్ఎస్‌కు ఇష్టం ఉందా లేదా అనే విషయాన్ని వ్యక్తం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, నాయకులు నిజాం, మారుతి పటేల్, శంకర్, జక్కన్న, బాలేశ్, గడ్డల సత్తయ్య, మల్లికార్జున్, వెంకటేష్, మిలింద్ పాల్గొన్నారు.

కెరమెరి : మహిళలు బ్రేక్ డాన్స్ చేయండంటు కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ అన్నారు. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాథోడ్ శంకర్ నాయక్, రాథోడ్ శేష రావు, పెండోర్ జల్పత్ రావు, నాయకులు దండుగుల శ్రీనివాస్, రాథోడ్ సుదర్శన్, కుటికల వెంకట స్వామి, బాబు నాయక్, గిడ్డప్ప, నాగు పటేల్, నగేష్, రజాక్, రాథోడ్ రవీందర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మహిళల గురించి అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే మహిళా సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో అసెంబ్లీలో కూడా ఆయన మహిళలను కించపరుస్తూ మాట్లాడాడనీ, ఇపుడు మళ్లీ వరలక్ష్మి శుక్రవారం రోజున మహిళల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆయన క్షమాపణలు చెప్పని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



కెరమెరిలో..

నేడు క్యాండిల్ ర్యాలీ

పశ్చిమబెంగాల్‌లో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం కాగజ్‌నగర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీదేవి తెలిపారు. ఆ రాష్ట్రానికి ఒక మహిళ ముఖ్యమంత్రి ఉన్నా, అక్కడ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ సాయంత్రం ఐదు గంటలకు లారీ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు మౌనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

చలో హైదరాబాద్‌కు తరలిన అతిథి ఆధ్యాపకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని సర్వీస్‌ను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రాజధానిలోని ఇంటర్మీడియట్ బోర్డు ఎదుట నిర్వహించిన ధర్నాకు శుక్రవారం జిల్లాలోని అతిథి ఆధ్యాపకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 2012 నుంచి ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల



మేనిఫెస్టోలో తమకు 42,000 పెంచుతూ సర్వీసు కొనసాగిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం జూలై 31 వరకు మాత్రమే తమ సర్వీస్ కొనసాగించి, రోడ్డుమీదికి నెట్టే పరిస్థితి కనిపిస్తోందన్నారు. వచ్చే నెలలో రెగ్యులర్ అధ్యాపకులు వస్తుండడంతో తమ ఉనికే ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సర్వీస్ రెన్యువల్ చేయడంతో పాటు, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హైదరాబాద్ వెళ్ళిన వారిలో జిల్లా నాయకులు మారుతి, కృష్ణమూర్తి, రాజన్న తోపాటు పలువురు అధ్యాపకులు ఉన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి వైద్య సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా వారి ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం తాగు నీరందించాలి

- క్లోరినేషన్ చేసిన నీటి సరఫరా చేయాలి
- దనోర పంప్ హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-కెరమెరి

నిరంతరం తాగు నీరందించాలని కలెక్టర్ వెంకటేష్ దౌత్రే అన్నారు. శుక్రవారం ధనోర గ్రామ సమీపంలోని 42 ఎంఎల్‌డీ సామర్థ్యం గల పంపు హౌజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్, అంటు వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా శుద్ధి చేయబడిన తాగునీరు వినియోగించాలని అన్నారు. శుద్ధి చేయబడిన తాగునీటిని వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. ధనోర పంపు హౌస్ పరిధిలో 970 ఆవాసాలకు శుద్ధ జలం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు పంచాయతీ, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. వైద్య సేవలతో పాటు ఇతర అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వర్షపు నీరు నిలువ లేకుండా అంతర్గత రహదారులలో గుంతలను పూడ్చడం, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి వంటి పనులు ప్రణాళికబద్ధంగా చేపడతామని తెలిపారు. కలెక్టర్‌తో పాటు పంపు హౌస్ డీఈ రాకేష్, ఏఈ సాయికిరణ్ పాల్గొన్నారు.

మహిళల కొరకు రైస్ మిల్లు ఏర్పాటు

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



నవతెలంగాణ-హాజీపూర్

మహిళల కొరకు త్వరలో మండలంలో రైస్‌మిల్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 90మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దసరా లోపు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, మాజీ ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డే బాలరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట రవి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ బీసీ ఎంప్లాయిమెంట్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ద్వారా జిల్లాలోని వంద మంది బీసీ నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 90 రోజుల వ్యవధితో కోర్సులకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని ఆసక్తి గలవారు ఈ నెల 24వ తేదీలోగా ఆన్ లైన్‌లో టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని పూర్తి వివరాలు వెబ్సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-మంచిర్యాల



ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుండా పోయిందని డాక్టర్ లపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక మాత శివు ఆస్పత్రి వైద్యులు డిమాండ్ చేశారు. కోలకతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. వైద్య విధ్యార్థిని పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, వైద్యులపై దాడులు జరుగకుండా ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. మంచిర్యాల ఐఎంఏ అధ్వర్యంలో 24 గంటల వైద్య సేవల బంద్‌కు పిలుపును ఇచ్చారు. బంధుకు ప్రయివేట్ హాస్పిటల్స్ మద్దతు తెలిపాయి.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ హరీశ్ రాజ్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, ప్రసవాలు, డ్రై డే కార్యక్రమాలపై ఆరా తీశారు. వైద్య సేవలను ఆక్కడ వైద్య సేవలు పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. 100 శాతం స్పష్టమైన రిజిస్టర్లను నిర్వహణ చేస్తూ ఆరోగ్య పరిమితులను మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవై డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్, వైద్యాధికారి రవి కిరణ్, డీఈఎంఓ వెంకటేశ్వర్లు, హెచ్ఐఓ చంద్ర శేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఫార్మసిస్ట్ అబ్దుల్ భారీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

క్వార్టర్ లేని కార్మికులకు ఇంటి అద్దె ఇవ్వాలి



నవతెలంగాణ-మందమర్రి

కేకే ఓసిలో పనిచేస్తున్న క్వార్టర్ లేని కార్మికులకు మున్సిపాలిటీ చట్టం ప్రకారం ఇంటి కిరాయి చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఇతర కార్మిక సంఘాలు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేకే ఓసి ఏర్పడక ముందు కెకె-2 భూగర్భ గనిగా ఉన్నప్పుడు మున్సిపాలిటీ చట్టం ప్రకారం ఇచ్చిన ఇంటి కిరాయి ఓసీగా మార్చిన తర్వాత ఇవ్వడం లేదని ఓసికి ట్రాన్స్‌ఫర్ వచ్చిన కొంతమంది కార్మికులకు కూడా మున్సిపాలిటీ ప్రకారం ఇంటికిరాయి ఇచ్చి ఆ తర్వాత రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న క్వార్టర్ లేని కార్మికులకు ఇంటికిరాయి అన్ని ఏరియాలలో చెల్లిస్తున్న కూడా మందమర్రి ఏరియాలో మాత్రం ఇంటికిరాయి చెల్లింపుపై ఉన్నతాధికారులు స్పందించడం లేదని జీఎం స్పందించి ఇంటికిరాయి ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జీఎం దేవేందర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రూ.27వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

- 35 శాతం లాభాల వాటాను ప్రకటించాలి
- వేజ్‌బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణికి ప్రభుత్వ నుంచి రావాల్సిన రూ.27 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, సింగరేణికి వచ్చిన లాభాల నుంచి కార్మికులకు 35 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం ఉపరితల గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం సంస్థ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ రెండు గుంటల భూమి, రూ. 20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యాల వల్ల సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని కాబట్టి నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అని చెప్పే సింగరేణి యాజమాన్యం పెరిక్స్ పై ఆదాయ పన్నును అధికారులకు యాజమాన్యమే చెల్లిస్తుందని కానీ కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదనిప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, మారుపెల్లి బాబు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు గుర్తింపు ఉంటుంది



నవతెలంగాణ-జన్నారం

ప్రజా సేవ చేసి అభివృద్ధి చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయినీ ప్రసాద్ నేత అన్నారు. శుక్రవారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీగా మా దాడి సరోజన రవీందర్‌రావు, వైస్ ఎంపీపీగా సుతారి వినయ్ కుమార్, మండలకో ఆప్షన్ సభ్యులుగా మున్వర్ అలీఖాన్, ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి తను చేసిన సేవలను కొనియాడారు. 30 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం, 33కేవీ విద్యుత్ లైన్ కోసం కోసం వారు శాయశక్తిలా కృషి చేశారన్నారు. మండల అభివృద్ధికి వారు చేసిన సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, నాయకులు, రూబెన్, బీఆర్ఎస్ నాయకులు వల్లాల నరస గౌడ్, వెంకటేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సోమగూడెం చేరుకున్న మహా పాదయాత్ర



నవతెలంగాణ-కాసిపేట

కొంరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం అభివృద్ధి కోసం మహాత్మా గాంధీ వేషధారణతో హైదరాబాద్ ప్రజాభవన్, సీఎం క్యాంప్ కార్యాలయానికి బయలు దేరిన ఆదివాసీ ఉద్యోమ నాయకుడు ధర్మ మహా పాదయాత్ర సోమగూడెంకు చేరుకోగా స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనెల శ్రీనివాస్, గుమాస భీమయ్య, అచ్యుత్‌రావు పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి పెద్దపీట

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజల అభివృద్ధికి పాటు పడుతుందని, నియోజక వర్గంలో ప్రజలకు విద్య వైద్య సదుపాయాలు అందించి నియోజక వర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో సీఎఆర్ఎఫ్ రూ.1,05,08,800 చెక్కులను 338 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే 654 మంది లబ్ది దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి పేద ప్రజల పక్షాన నిలిచామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దండేపల్లిలో బాలుర బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్లు, మంచిర్యాల పట్టణంలోని సాయికుంట, హాజీపూర్ మండలంలో బాలికల కొరకు ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 600 పడకల ఆస్పత్రి ఏర్పాటు అవుతున్నాయని నియోజకవర్గంలోని ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు చేరువవుతాన్నాయన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. హాజీపూర్ 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా హాజీపూర్, టీకనపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్ధిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్, ధర్మారం గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మున్నూరు కాపు సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆ గ్రామంలో మున్నూరు కాపు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా సీపతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజ్ కుమార్, సురేష్, కోశాధికారిగా లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడిశెట్టి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా నీరటి రాజేందర్, కార్యదర్శి పురం శెట్టి బాపు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని జయరాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, యూకేజీ నుంచి ఆరవ తరగతి వరకు చదివిన మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన చుంచు ప్రవళిక, ఏఈఈ ఉద్యోగం సాధించినందుకు శుక్రవారం ఆ పాఠశాల ప్రిన్సిపల్ మధుసూదన్ ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలలో ఉంటారన్నారు. ప్రవళిక నాగపూర్ ఎన్ఐటిలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి టీఎస్పీఎస్సీ ద్వారా పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు పలువురు ఆ విద్యార్థిని అభినందించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- మందమర్రి జీఎం జి.దేవేందర్



నవతెలంగాణ-కాసిపేట

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం జి దేవేందర్ అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గని కార్యాలయంలో గని మ్యాప్ ప్లాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం దేవేందర్ మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను, ఉత్పత్తి, ఉత్పాదకతలను, రక్షణతో కూడిన ఉత్పత్తి తీసి సంస్థకు మంచి పేరు తీసుకురావడంలో అందరూ భాగస్వామ్యవ్వాలన్నారు. ఆలోచించి, ఓపికతో అనుభవజ్ఞులైన వారి సలహాలతో పని చేయాలని, మందమర్రి ఏరియాలో కాసిపేట-1 గని మంచి ఉత్పత్తిని తీసుకురావాలన్నారు. రోజు వారీగా ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలన్నారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. నూతన జీఎంకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గ్రూప్ ఏజెంట్ రాందాస్, కాసిపేట గని మేనేజర్ భూ శంకరయ్య, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, సేఫ్టీ అధికారి సునీల్ కుమార్, పిట్ ఇంజనీర్ మధూకర్, డిప్యూటీ మేనేజర్ నిఖిల్, దిలీప్ కుమార్, ఏఐటీయూసీ పిట్, మైన్స్ కమిటీ నాయకులు బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు వొడ్నాల రాజన్న, చొల్లంగి శ్రీనివాస్, అబ్దుల్, ఐఎన్టీయూసీ నాయకులు బాపు, శంకర్, రాజన్న, కన్నయ్య, పిట్టల శివ శాలువాలతో సన్మానం చేశారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్‌లోని శ్రీ సాయి అనాధ వృద్ధాశ్రమం వెల్ఫేర్ సొసైటీలో శుక్రవారం తెలంగాణ ఎరుకల ప్రజా సమితి(టీవైపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కేంసారం తిరుపతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఉంద్రాల ఎల్లయ్య అధ్యక్షతన కేక్ కట్ చేసి, ఆశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకల కులస్తుల సంక్షేమం కోసం పాటుపడే నాయకుడి పుట్టినరోజు వేడుకలను ఇలా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాధుల సంతోషం, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఉంద్రాల రవి, కుర్ర రజిత, జె అంజి, వేమనపల్లి అధ్యక్షుడు జె సంతోష్, డి సంతోష్, జే అనిల్, రజనీకాంత్, డి సుదర్శన్, కే మహేష్ పాల్గొన్నారు.

18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

నవతెలంగాణ-నస్పూర్

ఆగస్టు 18న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మైనింగ్ స్టాఫ్ సదస్సు వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై శుక్రవారం మైనింగ్ స్టాఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం 18వ తేది సాయంత్రం 5 గంటలకు మందమర్రిలోని ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించే బెల్లంపల్లి రీజినల్ మైనింగ్ స్టాఫ్ సదస్సు, జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్‌యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి మిరియాల రంగయ్యకు హాజరు కానున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి రీజియన్‌లో ఉన్న మైన్స్, డిపార్ట్మెంట్, ఓసీలలో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్ అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, మైనింగ్ స్టాఫ్ రీజియన్ నాయకులు వంగరి రాజేశ్వర్ రావు, దర్శి గోపతి సత్యనారాయణ, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, మైనింగ్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్, కార్యదర్శి గోపతి సత్యనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి నాగేశ్వర్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీహరి, శివ, జావేద్, రంజిత్ కుమార్, వీ.రాజేందర్, మైనింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని సీఎం రాజీనామా చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల హామీలు నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు, చింతాగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజయ ధర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించినా నేటి వరకు ఏ ఒక్క రైతు ఖాతాలో రుణమాఫీ డబ్బులు పడలేదన్నారు. మాట నిలబెట్టుకొని సీఎం వెంటనే తన సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తను మాట తప్పడమే కాకుండా మాజీ మంత్రి హరీష్ రావును రాజీనామా చేయమనడం అతని అవివేకం అన్నారు. ఈ రోజు వరకు రూ.రెండు లక్షల రుణమాఫీ కాలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాసగౌడ్, సృజన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వయోవృద్ధుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం కమిటీని మండల వయోవృద్ధులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు లెక్కల మల్లయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు సీఎహ్ భాస్కర్ రాజు, ట్రిబునల్ మెంబర్ అన్నె కాంతమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్పటికి వయోవృద్ధులకు సహకారం అందడం లేదన్నారు. తెలంగాణలో దాదాపుగా 40, లక్షల వయోవృ ద్ధులు ఉన్న తెలంగాణలో రక రకాల కారణముల వలన కుటుంబ సభ్యుల సహకారం లేక పోషణకు, వైద్య సేవల కొరకు ఇబ్బంది పడుచున్నారన్నారు. కొన్ని సందర్భాలలో వృద్ధులను ఇంటి నుండి గెంటివేయబడుతున్నారన్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీరు మన రాష్ట్ర జనాభలో 10 శాతం ఉన్న వయోవృద్ధులు తమ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడుపుటకు వయొవృద్ధులకు ఆసరా పెన్షన్ రూ.4016 ప్రకటించాలన్నారు. మున్సిపాలిటీలు, మండలాలలో సీనియర్ సిటిజెన్స్‌కు భవనములు ఏర్పాటు చేయాలన్నారు. బస్ ఛార్జీలపై 50 శాతం రాయితీ కలిపించాలన్నారు. వృద్ధులకు అన్నిరకాల జబ్బులకు ప్రభుత్వ ప్రభుత్వ గ్రాంటు పొందుచున్న ప్రైవేటు ఆస్పత్రిలో ఉచిత సేవలు అందించాలని అంతిమదశలో ఉన్న తమను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యులు పాల్గొన్నారు.

ఆంగ్ల ప్రయోగశాలతో భాషా పరిజ్ఞానంపై మరింత పట్టు

నవతెలంగాణ-జైపూర్

అంగ్ల ప్రయోగశాల ద్వారా విద్యార్థులు భాషా పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించగలరని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. కొత్తగూడెంలో గల సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంగ్ల ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆంగ్ల ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు అదనపు పరిజ్ఞానం చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగ సాధన కోసం ఇంగ్లీషు భాషపై పట్టు సాధించటం, అనర్గళంగా మాట్లాడటం అవసరమని అన్నారు. సింగరేణి విద్యార్థినులు కూడా ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలనే ఉద్దేశంతో ఇక్కడ ఆంగ్ల ప్రయోగశాలను సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిందని తెలిపారు. బెంగుళూరుకు చెందిన తలియోలా ఇన్ఫోటెక్ సంస్థతో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో సింగరేణి మహిళా కళాశాలలో రూ.13.55లక్షల వ్యయంతో 20కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ పీఅండ్‌పీ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు, జీఎం సీడీఎన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం సెక్యూరిటీ, జీఎం పర్సనల్ ఐఆర్అండ్ పీఎం బీఆర్ దీక్షితులు, జీఎం ఎడ్యూకేషన్ బెనెడిక్ట్‌నికోలస్, జీఎం సివిల్ సూర్యనారాయణ, జేఈఎం పర్సనల్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా అశోక్ కుమార్ బాధ్యతలు


నవతెలంగాణ-లోకేశ్వరం



మండల నూతన ఎస్సైగా శుక్రవారం అశోక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సక్రియా నాయక్ బదిలీ కాగా నిజామాబాద్ ఐదోటౌన్‌లో విధులు నిర్వహించిన అశోక్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో సిబ్బంది ఆయనను స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కొత్త వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట మున్సిపాలిటీకి చెందిన కొత్త వెంకటేశ్వర్లు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల అధికారి గంప శ్రీనివాస్, పరిశీలకుడు అయిత రత్నాకర్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధ్రువీకరణ పత్రాన్ని రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి : అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యారోగ్య, పంచాయతీరాజ్, జ్యోతిబాపూలే, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా వసతి గృహాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్, డీఈఓ రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాజేందర్, సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో జైనథ్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో గెలిచే ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల అభిప్రాయాలను కార్యకర్తల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగే అవకాశాలున్న నేపథ్యంలో గెలిచే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని, దీనికి కార్యకర్తల నుంచే అభ్యర్థుల పేర్లను సేకరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోనే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలు సూచించిన అభ్యర్థులకే తొలి ప్రాధాన్య ఉంటుందన్నారు. అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమలో పార్టీ నాయకులు గిమ్మ సంతోష్, జైనథ్ మండల నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విచారణ జరగడం లేదు

- రిమ్స్ జూడాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- మానవహారంగా ఏర్పడి నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కతా వైద్య విద్యార్థి ఘటనలో అక్కడి కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిన పారదర్శకంగా విచారణ జరగడం లేదని, తాము భావిస్తున్నామని రిమ్స్ జూడా ప్రతినిధి కారుణ్య ఆరోపించారు. నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి రిమ్స్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చౌరాస్తాలో మనవహారంగా ఏర్పడి నిందితులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూడా ప్రతినిధి కారుణ్య మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై దాడి జరిగినట్లుగా భావించకుండా ఆడపిల్లలపై జరిగినట్టు భావించాలన్నారు. వైద్య కళాశాలల్లో సరైన వసతులు, రక్షణ లేకుండా పోతుందన్న దానికి ఈ ఘటన నిదర్శనంగా ఉందన్నారు. కేంద్రంలో గతంలో రక్షణ చట్టం తీసుకువచ్చిందని, కానీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. కోల్‌కతా ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్టు చెబుతున్న పోలీసులు గ్యాంగ్‌రేప్ జరిగినట్లు రిపోర్టు చెబుతున్నాయని మిగిత వారిని కూడా గుర్తించి పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, సిరిష్, జూడా ప్రెసిడెంట్ సందీప్ చారి ఉన్నారు.

కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ మహిళ సమాజాన్ని తీవ్రస్థాయిలో కించపర్చిన మాజీ మంత్రి కేటీఆర్ మహిళలపై చేసిన వివాదాస్పద వాఖ్యలపై శుక్రవారం నిర్మల్ ఆర్డీఓ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు ఎంబడి రాజేశ్వర్, కొట్టె శేకర్ మాట్లాడుతూ ఉచిత బస్‌ల్లో మహిళలు బ్రేక్ డ్యాన్స్‌లు చేయాలని కేటీఆర్ అనడం యావత్ తెలంగాణ రాష్ట్ర మహిళ సమాజాన్ని అవహేళన చేశారని మండిపడ్డారు. తెలంగాణ మహిళల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తే అది చూడలేక, జీర్ణించుకోలేక కేటీఆర్ ఇటువంటి వాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేటీఆర్ వెంటనే యావత్ తెలంగాణ మహిళ సమజానికి బహిరంగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే మహిళ లోకంతో కేటీఆర్ ఇంటిని ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రవికుమార్, నర్సారెడ్డి, సత్యపాల్‌రెడ్డి మనోజ్ జాదవ్, బొల్లోజు నర్సయ్య మోయిన్, అంజద్, ఆకుల నర్సయ్య, కొండ శ్రీనివాస్, సురేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాల : టీపీసీసీ పిలుపు మేరకు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అద్వర్యంలో శుక్రవారం మంచిర్యాల పట్టణంలో కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పట్టణంలోని ఐబీ చౌరస్తాలో కేటీఆర్ దిష్టి బొమ్మను దాహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులూ ముఖ్య కార్యకర్తలు, మహిళా నాయకులూ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు ప్రధాన రోడ్డుపై దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనను వ్యక్తం చేశారు. కేటీఆర్ యావత్ తెలంగాణ రాష్ట్ర మహిళలను కించ పరిచేలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆయన మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాబోయే రోజుల్లో మహిళలే ఆయనకు తగిన బుద్ధి చేబుతారని సవాల్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ముకాడే ఉత్తం, సోమురే నాగోరావ్, విశాల్, నాగనాథ్, దూద్‌రాం, కినక జుగాది పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ తెలంగాణ మహిళ ప్రజానీకాన్ని కించపరిచేలా బస్సులలో బ్రేక్ డాన్స్ చేయండి అంటూ కేటీఆర్ మాట్లాడటం తెలంగాణ మహిళలని కించపరచడమేనని బేషరతుగా తక్షణమే కేటీఆర్‌గా తన మాటలను వెనక్కు తీసుకొని, మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయశాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, పాల శంకర్, పోతారెడ్డి, మధుకర్, ఇసాక్, గంధం నవీన్, యాదవ్ రావు, మండడి గంగారామ్, నగేష్, ఆడే కృష్ణ, జాదవ్ కపిల్ దేవ్, తొడసం శంకర్, వినాయక్ రెడ్డి, మౌలానా, రాజేష్, ధనరాజ్, అమృత్, జబ్బర్, కుంట శంకర్ ఉన్నారు.

బజార్‌హత్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు జల్కే పాండు రంగ్ మాట్లాడుతూ మహిళలపై కేటీఆర్ చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఇట్టి వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరె పాండు, బత్తిని కిషన్, జడల శ్రీనివాస్, కీర్తి రమణ, కళ్లెం విఠల్ మహిబూబ్, కుంచం గంగాధర్, ముకుందు రావు, రాము, దినేష్, ఉన్నారు.



మంచిర్యాల

ఆదిలాబాద్‌టౌన్ : కాంగ్రెస్ కల్పిస్తున్న ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మనుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తు శుక్రవారం ప్రజాసేవ భవన్ ఎదుట కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేశారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ ఆర్టీసీ ఉచిత ప్రయాణంలో మహిళలు రికార్డింగ్, బ్రేక్ డ్యాన్సులకు ఉచితంగా వెళ్లొచ్చని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. మహిళా లోకాన్ని కించ పరిచే విధంగా ఆయన మాటాలున్నాయన్నారు. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలందరికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు కలాల శ్రీనివాస్, ఖయ్యుం, ఆనంద్‌రావు, గిమ్మ సంతోష్, షకీల్, నగేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-లోకేశ్వరం

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని కొందరు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. అనంతరం 82 మంది లబ్దిదారులకు దాదాపు రూ.20 లక్షలు విలువచేసే చెక్కులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య చేతుల మీదుగాఉత్తమ సేవ పురస్కారం అందుకున్న ఎంపీడీఓ సోలమాన్ రాజ్‌ను శాలువాతో సన్మానించారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే..

అధికారులతో సమీక్ష సమావేశంలో భాగంగా పలు గ్రామాలలో విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, డ్వాక్ర మహిళ సంఘాల సమస్యలపై రెవెన్యూ, ఐకేపీ, పంచాయతీ రాజ్, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు ఎమ్మెల్యే తెలుపగా అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఉన్నది ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అని వారు కడుతున్న పన్నులే మనం వేతనాలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతిఒక అధికారి చేస్తున్న పనిపై మనసు పెట్టి మానవతా దృక్పథంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. గ్రామాలలో ఉన్నా సమస్యలను గుర్తించి, తనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు, బీజేపీ మండల కార్యదర్శి జయసాగర్ రావ్, చిన్నారావ్, ఒరికె పోతన్న, ప్రవీణ్ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, తహసీల్దార్ అర్క మోతీరాం, ఎంపీడీఓ సోలమన్ రాజ్, ఏఈ శివకుమార్, సూపరింటెండెంట్ వెంకట రమేష్, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌గౌడ్, ఏపీఓ జగన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పాపన్న జయంతి నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌కు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వారోత్సవాల నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నిర్మల్‌కు చెందిన అమరవేణి నర్సాగౌడ్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో జిల్లా బీసీ, ఎస్సీ, గౌడ సంఘాల నాయకులు శాలువాలు పూలమాలలతో నర్సాగౌడ్‌ని సన్మానించారు. మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్, జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకులు మూడుసు సత్యనారాయణ, మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఇల్లందుల రాజాగౌడ్, రాష్ట్ర నాయకులు నాగుల వెంకా గౌడ్, జిల్లా నాయకులు వల్లకొండ నర్సాగౌడ్, పోడేటి రాజు, నాగుల శ్రీనివాస్, నారాయణ, బండి మధు, బూర శ్రీనివాస్, కందునూరి అశ్విన్, నాగుల కృష్ణ పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



నవతెలంగాణ-తాంసి

కరెంట్ కోతలను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని జామిడి గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు మండల కేంద్రంలోని విద్యుత్తు సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్తు కోతలు విధిస్తుండటంతో ఆగ్రహానికి గురైన జనం శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు ఎవరూ లేకపోవడంతో గంటన్నరకు పైగా నిరసన తెలిపారు. మండల విద్యుత్‌శాఖ అధికారితో పాటు సీనియర్ లైన్‌మెన్‌లు తాంసి మండలానికి వద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా మండలంలోని గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోతున్నదని అన్నారు. చిన్నపాటి గాలి, వాన దుమారం వస్తే చాలు కరెంటు ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా కరెంటు కోతలకు సంబంధించి, పలుమార్లు విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. వేసవిలో ఎన్నో అవస్థలు పడ్డామని, వానకాలంలోనూ పరిస్థితిలో మార్పు లేదని వాపోయారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా లేదన్నారు. దీంతో అదే రోజు రాత్రి సమస్యను సబ్ స్టేషన్ అధికారులకు వివరిస్తే, జామిడి గ్రామస్తులు మద్యం తాగి వచ్చి కరెంటు లేదని గొడవ పడుతున్నారని మా పైన నిందలు వేయడం సరికాదన్నారు. కరెంటు లేదని అధికారులను నిలదీస్తే గ్రామస్తులు, రైతులపైనే అధికారులు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. తిరిగి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా లేకపోవడం ఫోన్ చేసిన మండల అధికారులు స్పందించకపోవడంతోనే రాత్రిపూట మళ్లీ కరెంటు లేదని అడుగుతే అధికారులు నిందలు వేస్తారని, పగలు సబ్ స్టేషన్‌ను ముట్టడించినట్లు తెలిపారు. మండల విద్యుత్‌శాఖ అధికారి, సీనియర్ లైన్ మెన్‌లు విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్తు సరఫరా సమస్యలు వస్తున్నాయని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాడం లేదన్నారు. జిల్లా అధికారులకు సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎస్ఈకి వివరిస్తామని ఆందోళనకారులు ఫోన్లో మాట్లాడదానికి ప్రయత్నం చేయగా, జిల్లా స్థాయి అధికారి కూడా స్పందించలేదన్నారు. శనివారం ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారి ఆందోళన విరమించారు. కరెంటు సరఫరా మెరుగు పడకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

భక్తిప్రపత్తులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

- పాల్గొన్న కలెక్టర్ సతీమణి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర శ్రావణ మాస శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలను ముత్తైదువులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించిన మాదిరిగానే పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా సతీమణి యాపల్‌గూడ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ నికిత పంత్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేదపండితులు మేఘ రాజ్ శర్మ వరలక్ష్మీ వ్రతం విశిష్టతను వివరిస్తూ అతిధులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చిన మహిళలచే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కత్రి, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, సభ్యులు రవీందర్, సూర్యకాంత్, సుధీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని రబింద్రా పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ను వైభవంగా జరుపుకున్నారు. పాఠశాలలో లక్ష్మీదేవి ప్రతిమలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పండ్లు, పువ్వులు, పిండి వంటకాలు పెట్టి పూజించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్ డైరెక్టర్ పోతన్న యాదవ్, బీమ్‌రావు దేశాయ్, ఉపాధ్యాయురాలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి : మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో అమ్మవారికి వివిధ రకాలైన మధురమైన పదార్థాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. పూజానంతరం ఇంటిచుట్టూ ఉన్న బంధుమిత్రులను, ముత్తైదువులను ఆహ్వానించి వారిచే ఆశీస్సులు తీసుకున్నారు. వచ్చినవారికి నానబెట్టిన శెనగలు, పెసలు వాయినంగా ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఎక్కడ చూసిన వరలక్ష్మి వ్రతాలతో ఆయా దేవాలయాలలో సందడి నెలకొంది.

నస్పూర్ : శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దంపతులు రమేష్ మమత అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్ళు హారిక, సుకన్య, అపర్ణ, మల్లేశ్వరి, శైలజ, శ్వేత పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు ఉదయం నుండే ఆలయాలకు తరలివెళ్లి వాయినాలు ఇచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ లో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కొడిపాక వేణుగోపాల్, సభ్యులు కల్లూరి సంతోష్, మాతృభారతి సభ్యురాలు కాంద్రే దుర్గ, కల్లూరు వైష్ణవి, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్టపై స్వయంభూ వెలసిన శ్రీకేతేశ్వర కంకలమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆలయ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని సుగుణ నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు వేడుకలో భాగంగా అభిమానులు ఇలాంటి గొప్ప కార్యక్రమం చేయటం జీవితంలో మరువలేనిదని, యువతకు అవయవ దానంపై అవగాహన కల్పించిన మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కంబ్లె అతిష్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రం సుగుణ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలను స్థానిక బుద్ధ విహార్‌లో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముకాడే ఉత్తం, సోమురే నాగోరావ్, నాగ్‌నాథ్, దూద్‌రామ్, జుగాది రావ్ పాల్గొన్నారు.